

ప్రజా న్యూస్
నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 169,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,గురువారం , తేదీ : 22-10-2026

తిరుమలలో ఎడతెరిపి లేని వర్షం - సర్వదర్శనానికి
6 గంటల సమయం, ఘాట్ రోడ్డులో ప్రయాణీకులకు అలర్ట్



బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రంలో నిన్నటి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది.

తిరుమలలో ఎడతెరిపి లేని వర్షం

తిరుపతి : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రంలో నిన్నటి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దట్టమైన నల్లటి మబ్బులు, మిగతా..2లో

హైదరాబాద్‌లో దుర్గామాత నిమజ్జనాలు.. నగరవ్యాప్తంగా ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్‌లో దుర్గామాత విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఆంక్షలు విధించారు.

హైదరాబాద్, అక్టోబర్ 21: నగరంలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఆంక్షలు విధించారు. పలు ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తున్నారు. పీపుల్స్ ప్లాజా, గార్డెన్ పాయింట్, జలవిహార్, సంజీవయ్య పార్క్ బేబీ పాండ్స్ వద్ద విగ్రహాల నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో పంజాగుట్ట, రాజ్‌భవన్ వైపు నుంచి ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌కు వచ్చే వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లిస్తున్నారు. వి.వి. విగ్రహం వద్ద ట్రాఫిక్‌ను నిరంకారి జంక్షన్ వైపు పంపిస్తున్నారు. ఇక్బాల్ మినార్ వైపు సాధారణ వాహనాలకు అనుమతి నిరాకరించారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాల వాహనాలకు మిగతా..2లో

ఎల్‌నినో ఎఫెక్ట్.. ఉపాధి హామీ పనులపై
తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..!



- వర్షాలు తగ్గే పరిస్థితులు ఏర్పడితే ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని
- ప్రస్తుతం 29 అడుగుల మేర నీరు అందుబాటులో ఉందని తెలిపారు.
- నీటి నిల్వలు, సరఫరా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులను మంత్రి సూచించారు.

ములుగు: ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత పెరిగి, వర్షాలు తగ్గే పరిస్థితులు ఏర్పడితే ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా

మైసూరు దసరా ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి..
చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

- కర్ణాటక రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించే చారిత్రక మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.
- మైసూరు దసరా ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి.. చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



హైదరాబాద్ :కర్ణాటక రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించే చారిత్రక మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలను వీక్షించేందుకు ముఖ్యమంత్రి మైసూరుకు చేరుకున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు ఈ వేడుకల్లో పాల్గొన్న ఆయన.. ముందుగా మైసూరు ప్రజల ఆరాధ్య దైవమైన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని.. ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మైసూరు రాజభవనం ఎదుట అత్యంత వైభవంగా నిర్వహించిన దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. మైసూరు దసరా ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన జంబూ సవారిని మిగతా..2లో

తెలంగాణకు బీసీ సీఎం..
కానీ ఇప్పుడే కాదు



- బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్
- రేవంత్ రెడ్డి పాలన 2039 వరకు కొనసాగుతుందని విశ్వాసం
- కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణకు బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య

హైదరాబాద్: తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత మిగతా..2లో

జాతీయ భద్రతను పరిరక్షించడంలో
కేంద్రం విఫలం'- మణిపుర్ హింసాకాండపై కాంగ్రెస్



- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.
- శాంతిభద్రతలను కాపాడటంలో, జాతీయ భద్రతను రక్షించడంలో బీజేపీ ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

ఢిల్లీ : మణిపుర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై కాంగ్రెస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో, రాజ్యాంగ హక్కులను పరిరక్షించడంలో, జాతీయ భద్రతను రక్షించడంలో బీజేపీ విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు.

ఏపీ మునిసిపల్ ఎన్నికలు
నామినేషన్ల గడువుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

ఆంజఆంధ్రప్రదేశ్‌లో మునిసిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి.



ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మునిసిపల్ ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల సమస్యల కారణంగా అభ్యర్థులు ఎక్కడెక్కడ నామినేషన్లు దాఖలు చేయలేకపోయారో, ఆయా ప్రాంతాల్లో నామినేషన్ల గడువు పొడిగించే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు సూచించింది. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి 48 గంటల గడువు ఇచ్చింది. ఈ మునిసిపల్ ఎన్నికల్లో నామినేషన్ల గడువును పొడిగించేలా కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హైకోర్టును ఆశ్రయించగా, ఆ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆ పార్టీ నాయకుడు లేళ్ల అప్పిరెడ్డి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పార్టీ తరపున న్యాయవాది మహీందర్ సింగ్ వాదనలు వినిపించారు. ఈ కేసును విచారించిన జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ నామినేషన్ల గడువు పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటే, ఆ నిర్ణయాన్ని ప్రకటించినప్పటి నుంచి నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులకు కనీసం 48 గంటల గడువు ఇవ్వాలని కోర్టు సూచించింది. జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు నిలిపివేయాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. సాధారణంగా నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. మిగతా..2లో

అమెరికాకు ఓ పెద్ద దండం బ్రో..
భారత్‌కు తిరిగొస్తున్న ఐటీ నిపుణులు!

- హైదరాబాద్, బెంగళూరు, పుణె, గురుగ్రామ్ వంట నగరాలు వారికి ప్రధాన గమ్యస్థానాలుగా మారుతున్నాయి.
- దేశంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) విస్తరణ రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్‌కు ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలుస్తోంది.



ఢిల్లీ : అమెరికాలోని ప్రముఖ ఐటీ, సాంకేతిక సంస్థల్లో పనిచేస్తున్న భారతీయ వైట్‌కాలర్ ఉద్యోగులు తిరిగి స్వదేశంలో స్థిరపడేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుబాటులో ఉన్న స్టాఫింగ్ సంస్థల గణాంకాల ప్రకారం, 2026 తొలి తొమ్మిది నెలల్లోనే దాదాపు 12,700 మంది టెక్ నిపుణులు అమెరికాను వీడి భారత్‌కు తిరిగివచ్చినట్లు సమాచారం. 2023లో 7,200 మంది, 2024లో 9,800 మంది, 2025లో 15,100 మంది స్వదేశానికి చేరుకున్నట్లు పేర్కొంటున్నారు. ఈ ఏడాది కూడా ఇదే ధోరణి కొనసాగితే గత రికార్డులను అధిగమించే అవకాశం ఉంది. ఒకప్పుడు అమెరికాలో మిగతా..2లో

బంగాళాఖాతంలో అల్పపీడనం..
ఏపీ, తెలంగాణకు రెయిన్ అలర్ట్..



- ఏపీ, తెలంగాణలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలను వాతావరణశాఖ జారీ చేసింది.
- ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.
- భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది.

తమిళనాడు తీరానికి సమీపంలోని నైరుతి బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడన ప్రాంతం అక్టోబర్ 21న

రప్పా రప్పా' అంటూ రౌడీయిజం చేస్తే సహించం..
శాంతిభద్రతల్లో ఏపీ ఆదర్శంగా నిలవాలి

- పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- శాంతిభద్రతల పరిరక్షణలో ఏపీ దేశానికే ఆదర్శం కావాలని పిలుపు
- రాజకీయ ముసుగులో నేరాలు, రౌడీయిజంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం
- భద్రత ఉంటేనే పెట్టుబడులు వస్తాయి, అభివృద్ధి సాధ్యమని స్పష్టీకరణ
- సైబర్ నేరాలపై అప్రమత్తత, టెక్నాలజీ వినియోగం పెంచాలని పోలీసులకు సూచన
- అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ



అమరావతి : ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజకీయ ముసుగులో అరాచకాలు, రౌడీయిజం చేసేవారిని ఉక్కుపాదంతో అణిచివేయాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు పోలీసు యూనిఫాం చూస్తే భయం కలగాలని, అదే సమయంలో బాధితులకు పూర్తి భరోసా లభించాలని ఆయన ఆకాంక్షించారు. మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో నేడు నిర్వహించిన 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర పోలీసులకు ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఖాకీ అంటే బాధ్యత, పోలీసు అంటే భరోసా. ప్రమాదం జరిగినా, నేరం జరిగినా ప్రజలకు మొదటగా గుర్తొచ్చేది పోలీసులే. ప్రజలు పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడానికి పోలీసులు తమ కుటుంబ సంతోషాలను త్యాగం చేస్తున్నారు" అని అన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్, వీఐపీల పర్యటనలు ప్రశాంతంగా ముగియడం వెనుక పోలీసుల నిరంతర శ్రమ అభినందనీయమని కొనియాడారు. 1959లో లడఖ్‌లో చైనా సైనికులతో పోరాడుతూ పది మంది పోలీసులు ప్రాణాలర్పించారని, వారి త్యాగాలకు గుర్తుగా ఏటా ఈ దినాన్ని జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. మిగతా..2లో

సొంత జిల్లాలో టీడీపీ ఖాతాలోకి
ఏకగ్రీవంగా 6 మున్సిపాలిటీలు



- వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కడపలో ఆ పార్టీకి ఎదురుదెబ్బ
- రాయచోటి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు వంటి కీలక స్థానాలు టీడీపీ వశం
- నామినేషన్లను అడ్డుకున్నారంటూ వైసీపీ ఆరోపణలు

అమరావతి: రాష్ట్ర రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కడపలో ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి కడప జిల్లాలోని కీలక మున్సిపాలిటీలను టీడీపీ నేతృత్వంలోని కూటమి ఏకగ్రీవంగా కైవసం చేసుకుని రాజకీయంగా ప్రకంపనలు సృష్టించింది. ఈ విజయాలతో జిల్లాపై టీడీపీ పట్టు సాధించినట్లయింది. తాజా పరిణామాల ప్రకారం... మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

తిరుమలలో ఎడతెరిపి లేని వర్షం - సర్వదర్శనానికి 6 గంటల సమయం, ఘాట్ రోడ్డులో ప్రయాణీకులకు అలర్ట్

పొగమంచు తిరుగిరులను కమ్మేయడంతో కొండపై సాధారణ జీవితం స్తంభించిపోయింది. నిరంతరాయంగా పడుతున్న వర్షం కారణంగా శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షంతో జలమయమైన తిరుమల పరిసరాలు : నిన్న అర్ధరాత్రి నుంచి వర్షం మరింత తీవ్రం కావడంతో శ్రీవారి ఆలయ ప్రాంగణంతో పాటు తిరుమలలోని ప్రధాన రహదారులు, పరిసర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దర్శనానికి వెళ్లే భక్తులు వర్షంలో తడుస్తూనే క్యూలైన్లలో ముందుకు సాగుతున్నారు. దర్శనం ముగించుకుని బయటకు వచ్చిన భక్తులు వసతి గదులు, లడ్డు విక్రయ కేంద్రాలకు వెళ్లేందుకు వీలులేక, టీటీడీ ఏర్పాటు చేసిన షెడ్ల కింద తలదాచుకుంటున్నారు. ఘాట్ రోడ్డులో ప్రయాణీకులకు హెచ్చరిక : కొండపై కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందని టీటీడీ సిబ్బంది భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తిరుమల కొండపైకి వెళ్లే, కిందకు వచ్చే వాహనదారులు అత్యంత జాగ్రత్తగా, నెమ్మదిగా ప్రయాణించాలని భద్రతా సిబ్బంది సూచిస్తున్నారు. శ్రీవారి దర్శన విశేషాలు & తాజా గణాంకాలు: ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ తిరుమలకు భక్తుల రాక ఏమాత్రం తగ్గలేదు. శ్రీవారి సర్వదర్శనం, తాజా లెక్కింపు వివరాలు ఇలా ఉన్నాయి: వేచి ఉండే సమయం: ప్రస్తుతం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. భక్తులు 9 కంపార్టుమెంట్లలో వేచి ఉన్నారు.

సొంత జిల్లాలో టీడీపీ ఖాతాలోకి ఏకగ్రీవంగా 6 మున్సిపాలిటీలు

ప్రొద్దుటూరు, బద్వేల్, జమ్మలమడుగు, రాయచోటి, రాజంపేట, కమలాపురం మున్సిపల్ ఛైర్మన్ పీఠాలను టీడీపీ ఏకగ్రీవంగా దక్కించుకుంది. ముఖ్యంగా రాయచోటిలోని మొత్తం 44 వార్డులను కూటమి పార్టీలు ఏకగ్రీవంగా గెలుచుకోవడం విశేషం. మిత్రపక్షమైన బీజేపీకి ఎర్రగుంట్ల మున్సిపాలిటీని కేటాయించి కూటమి ఐక్యతను చాటుకుంది. అంతేకాకుండా, జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల మున్సిపాలిటీపై కూడా టీడీపీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే, ఈ ఏకగ్రీవాలపై వైసీపీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. అధికార కూటమి అక్రమాలు, దౌర్జన్యాలతో తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుందని, కొన్నిచోట్ల నామినేషన్ పత్రాలను అక్రమంగా తిరస్కరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దాడులు, బెదిరింపులతో తమను ఎన్నికల నుంచి తప్పించలేరని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ విజయాలపై కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి స్పందిస్తూ... ఉమ్మడి కడప జిల్లాలో ప్రజలు సరికొత్త రాజకీయ మార్పును కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని వినూత్న పరిణామాలు చూస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు కడప జిల్లా రాజకీయ సమీకరణాల్లో కీలక మార్పులకు సంకేతంగా నిలుస్తున్నాయి.

మైసూరు దసరా ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి.. చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తిగా వీక్షించారు. అందంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. సంప్రదాయ వాయిద్యాల నడుమ, కన్నడ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళాకారులు, సంగీత బృందాలు, నృత్య బృందాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో సాగిన ఈ ఊరేగింపు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. రంగురంగుల వస్త్రధారణలు, సంప్రదాయ నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు, అలంకరించిన ఏనుగులు ఈ వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి. కర్ణాటకలో రాష్ట్ర పండుగగా జరుపుకునే నాడ హబ్బ ఉత్సవాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, కళలు, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ఈ వేడుకల్లో కేరళకు చెందిన ప్రముఖులతో పాటు దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని ఉత్సవాలను వీక్షించారు. వివిధ రాష్ట్రాల నాయకులు, ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలు జాతీయ స్థాయిలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు: మహేశ్ గౌడ్

ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు. బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.

ఏపీ మునిసిపల్ ఎన్నికలు: నామినేషన్ల గడువుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

ఏదైనా స్థానంలో ఒక్కరే పోటీలో ఉంటే, ఆ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటిస్తారు. ఆ జాబితా ప్రకటించిన తరువాత పోలింగ్ ప్రక్రియ నిలిపివేయడం కష్టం. ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు 12 మునిసిపాలిటీల్లో ఏకగ్రీవ ఎన్నికలకు అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. అభ్యర్థుల తుది జాబితా అక్టోబర్ 21 (బుధవారం)న విడుదల కావాల్సి ఉంది. తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు నిలిపివేయాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, ఈ ఆదేశం రాష్ట్రమంతటికీ వర్తిస్తుందా, లేక సంబంధిత మునిసిపాలిటీలకు మాత్రమే వర్తిస్తుందా అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ప్రభుత్వం ఏమని వాదించింది?

అంతేకాకుండా, నామినేషన్ల గడువు పొడిగిస్తే నామినేషన్ కేంద్రాల వద్ద తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీటీవీ కెమెరాల నిఘా ఉండేలా చూడాలని, అభ్యర్థులకు రక్షణ కల్పించాలని రాష్ట్ర డీజీపీని సుప్రీంకోర్టు ఆదేశించింది. "గడువును ఒక రోజు పొడిగించేందుకు ప్రయత్నించండి" అని జస్టిస్ బాగ్చి ఎన్నికల సంఘం తరపు న్యాయవాదికి సూచించినట్లు లైవ్‌లా వెబ్‌సైట్ రిపోర్ట్ చేసింది. ఈ ఆదేశాలపై తీసుకున్న చర్యలకు సంబంధించి అక్టోబర్ 27న అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. "పుంగనూరు, రాయచోటి, కడప, తిరుపతి వంటి ప్రాంతాల్లో తీవ్ర హింస జరిగింది. కడపలో నామినేషన్ పత్రాలను లాక్కుని చింపేశారు. తిరుపతిలో అభ్యర్థులను కార్యాలయాల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దాదాపు 63 శాతం స్థానాల్లో మా అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారు" అని వైఎస్సార్సీపీ తరపున న్యాయవాది మహీందర్ సింగ్ వాదించారు. ఈ కేసులో రాష్ట్ర ఎన్నికల సంఘం తరపున పరమేశ్వర్, ప్రభుత్వం తరపున సిద్ధార్థ లూథ్రా, ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. "హింసకు వైఎస్సార్సీపీయే కారణం. బయటి ప్రాంతాల నుంచి ప్రజలను తీసుకొచ్చారు. ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక కోర్టులు జోక్యం చేసుకోకూడదు. శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉన్నాయి" అని ఎన్నికల సంఘం తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు.

జాతీయ భద్రతను పరిరక్షించడంలో కేంద్రం విఫలం' మణిపుర్ హింసాకాండపై కాంగ్రెస్

ఇటీవల నలుగురు అమాయక పౌరులు హత్యకు గురికావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మే 2023 నుంచి ఇప్పటివరకు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 24,530 మంది సహాయక శిబిరాల్లో దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రం తీసుకున్న చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మళ్లీ రక్తసిక్తమైన మణిపుర్

మణిపుర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండలో నలుగురు అమాయక పౌరులు దారుణంగా హత్యకు గురికావడాన్ని ఖర్గే ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ అసమర్థత వల్లే రాష్ట్రం మళ్లీ రక్తసిక్తమవుతోందని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. మే 2023లో లోయ ప్రాంతానికి చెందిన మైతీ వర్గానికి, కొండ ప్రాంతానికి చెందిన కుకీ వర్గానికి మధ్య ప్రారంభమైన జాతి ఘర్షణలు రాష్ట్రాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని పేర్కొన్నారు. ఈ హింసాకాండలో ఇప్పటివరకు కనీసం 306 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 49 మంది ఆచూకీ తెలియకుండా పోయిందని,

హైదరాబాద్‌లో దుర్గామాత నిమజ్జనాలు.. నగరవ్యాప్తంగా ట్రాఫిక్ ఆంక్షలు

మాత్రమే అనుమతి కల్పిస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్ సైఫాబాద్ వద్ద వాహనాలను రవీంద్ర భారతి, మాసాబ్‌ట్యాంక్ వైపు మళ్లిస్తున్నారు. ఖైరతాబాద్ బడా గణేశ్ లేన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అప్పర్ ట్యాంక్ బండ్ నుంచి వచ్చే వాహనాలను లిబర్టీ వైపు మళ్లిస్తున్నారు. బర్టీ నుంచి సెక్రటేరియట్ జంక్షన్ వైపు సాధారణ వాహనాలకు అనుమతి ఉండదు. నల్లగుట్ట బ్రిడ్జ్, పీవీ మార్గ్ వైపు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను మినిస్టర్ రోడ్డు వైపు మళ్లిస్తున్నారు. రాణిగంజ్, మినిస్టర్ రోడ్డు నుంచి నెక్లెస్ రోడ్డు వైపు వచ్చే వాహనాలకు కూడా ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు. సెక్రటేరియట్ జంక్షన్ పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు పలు చోట్ల మళ్లింపులు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమాలకు వచ్చే భక్తులు, నగర ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని తమ ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడంతో పాటు ట్రాఫిక్ పోలీసుల సూచనలు, ఆదేశాలను పాటించాలని కోరుతున్నారు. నిమజ్జన ప్రాంతాల పరిసరాల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వాహనదారులు సహకరించి ట్రాఫిక్ నియంత్రణకు తోడ్పడాలని అధికారులు సూచిస్తున్నారు.

రప్పా రప్పా' అంటూ రౌడీయిజం చేస్తే సహించం.. శాంతిభద్రతల్లో ఏపీ ఆదర్శంగా నిలవాలి

మొదటి పేజి తరువాయి

శాంతిభద్రతలతోనే అభివృద్ధి, పెట్టుబడులు

రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి, ప్రజల సంతోషం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని చంద్రబాబు విశ్లేషించారు. "భద్రత, భరోసా ఉన్న చోటకే పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయి. తద్వారానే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అందుకే తాను అధికారంలో ఉన్న ప్రతిసారీ శాంతిభద్రతలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తాను" అని పునరుద్ఘాటించారు. గతంలో ఫ్యాక్షన్‌ను నియంత్రించడం, నక్సలిజాన్ని ఎదుర్కోవడం, మత ఘర్షణలను అరికట్టడంలో ఏపీ పోలీసులు చూపిన ధైర్యసాహసాలు అసాధారణమైనవని ప్రశంసించారు. ఇటీవల దేశ భద్రతకు సంబంధించిన కుట్రలను ఛేదించిన కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆధునిక నేరాలకు టెక్నాలజీతో చెక్

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా మారుతోందని, పోలీసు శాఖ దర్యాప్తు పద్ధతుల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. "ఒకే ఒక్క ఫోన్ కాల్, ఒక లింక్‌తో కష్టపడి సంపాదించుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు. చదువుకున్నవారు సైతం మోసపోతున్నారు. ఇలాంటి నేరాలు జరగకుండా నివారించడమే ఉత్తమ పోలీసింగ్" అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి వాటిని పూర్తిస్థాయిలో వినియోగించి దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచుకోవాలని కోరారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో 'ఈగల్' బృందం చేస్తున్న కృషిని అభినందించారు. మహిళలపై నేరాలకు పాల్పడాలంటేనే భయపడే వాతావరణం కల్పించాలని ఆదేశించారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఒత్తిడితో పనిచేసే పోలీసులు యోగా, ధ్యానం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. అమరుల త్యాగాలకు అసలైన నివాళి అర్పించాలంటే ప్రజలకు నిరంతర భద్రత కల్పించడమే మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు అమర జవాన్ స్మృతిచిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం 'షహీద్ పుస్తక్ టోలీ', 'అమరులు వారు' పుస్తకాలను ఆవిష్కరించారు. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, ఫోరెన్సిక్, విపత్తు నిర్వహణ, ఆక్టోపస్ విభాగాల ఆధునిక ఆయుధాల గురించి అడిగి తెలుసుకున్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఏపీ, తెలంగాణకు రెయిన్ అలర్ట్..

మొదటి పేజి తరువాయి

వఉదయం 08:30 గంటల సమయానికి అదే ప్రాంతంలో కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. థాయిలాండ్ గల్ఫ్, దానిని ఆనుకుని ఉన్న థాయిలాండ్, మయన్మార్ ప్రాంతాల్లో ఉన్న నిన్నటి ఉపరితల ఆవర్తనం అక్టోబర్ 21వ తేదీన ఉదయం 08:30 గంటలకు సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి కొనగుతున్నది. ఇది ఈరోజు (అక్టోబర్ 21) ఉత్తర అండమాన్ సముద్రంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ఆ తర్వాత ఇది పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 23, 2026 ప్రాంతంలో ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న తూర్పు-మధ్య బంగాళాఖాతంలో ఒక అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉంది. ఆ తర్వాత ఇది వాయవ్య దిశగా కదులుతూ తదుపరి 3 రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉంది. నైరుతి బంగాళాఖాతం, తమిళనాడు తీర ప్రాంతంలోని అల్పపీడన కేంద్రం నుండి ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు, సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉన్న ద్రోణి ఇప్పుడు తక్కువగా గుర్తించబడినది. వీటి ఫలితంగా ఏపీ, తెలంగాణలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలను వాతావరణశాఖ జారీ చేసింది.

మూడ్రోజుల పాటు వర్షాలు

కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమలో రాబోయే మూడ్రోజుల పాటు తేలికపాటినుండి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కిలోమీటర్ల గరిష్టముగా 50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.

తెలంగాణకు వర్షసూచన

నైరుతి బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న తమిళనాడు తీరంపై ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈరోజు (అక్టోబర్ 21, 2026) ఉదయం 05:30 గంటలకు అదే ప్రాంతంలో ఒక అల్పపీడనం ఏర్పడింది. ఈరోజు ఉదయం 08:30 గంటలకు కూడా అదే ప్రాంతంలో కొనసాగుతోంది. దానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉంది. నైరుతి బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న తమిళనాడు తీరంలోని అల్పపీడన కేంద్రం నుండి ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో ఉన్న ద్రోణి బలహీనపడింది. గల్ఫ్ ఆఫ్ థాయ్‌లాండ్, దానిని ఆనుకుని ఉన్న థాయ్‌లాండ్, మయన్మార్ మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం ఈరోజు అక్టోబర్ 21 ఉదయం 08:30 గంటలకు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతోంది. ఇది ఈరోజు అక్టోబర్ 21 నాటికి ఉత్తర అండమాన్ సముద్రంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ఆ తర్వాత ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతుంది. దీని ప్రభావంతో 2026 అక్టోబర్ 23 నాటికి ఆగ్నేయ, దానిని ఆనుకుని ఉన్న తూర్పు-మధ్య బంగాళాఖాతంలో ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఆ తర్వాత ఇది వాయవ్య దిశగా కదిలి తదుపరి 3 రోజుల్లో మరింత తీవ్రపడే అవకాశం ఉంది. వీటి ప్రభావంతో తెలంగాణలో రాబోయే మూడ్రోజులు పాటు వర్షాలు కురవనున్నాయని హైదరాబాద్ వాతావరణశాఖ అంచనా వేసింది. తెలంగాణ రాష్ట్రంలో ఈ రోజు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు, ఎల్లుండి పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. ఈ రోజు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు సంభవించే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించడానికి, పౌరులను రక్షించడానికి, భద్రతాపరమైన సవాళ్ల

వేలాది మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఈ ఘర్షణల ప్రభావాన్ని మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు ఇప్పటికీ ఎదుర్కొంటున్నాయని ఖర్గే అన్నారు. వేలాది మంది తమ ఇళ్లకు దూరంగా సహాయక శిబిరాల్లో జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడం, బాధితులకు భద్రత కల్పించడం, నిర్వాసితులను తిరిగి వారి నివాసాలకు చేర్చడం వంటి అంశాల్లో కేంద్రం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

మోదీ, అమిత్ షాకు మూడు ప్రశ్నలు

మణిపుర్ పరిస్థితులపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా మూడు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. జూన్ 2023లో అమిత్ షా ఏర్పాటు చేసిన శాంతి కమిటీకి ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించడానికి, పౌరులను రక్షించడానికి, భద్రతాపరమైన సవాళ్లను పరిష్కరించడానికి ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలేమిటని నిలదీశారు. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ సిఫార్సులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని కోరారు. సహాయక శిబిరాల్లో 31 అసహజ మరణాలు సంభవించినట్లు సుప్రీంకోర్టు వెల్లడించినప్పటికీ, వేలాది మంది ఇంకా ఎందుకు నిరాశ్రయులుగా ఉన్నారని ఖర్గే ప్రశ్నించారు. మహిళలు, పిల్లలు, నిర్వాసిత కుటుంబాల భద్రత, గౌరవం, పునరావాసం కోసం ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడేళ్లకు పైగా కాలం గడిచినా పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని విమర్శించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం, ముఖ్యమంత్రిని మార్చడం, తిరిగి బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం వంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నా శాంతి నెలకొనలేదని ఖర్గే అన్నారు. హింస ప్రారంభమైన తర్వాత దాదాపు 29 నెలల పాటు మణిపుర్‌లో అడుగుపెట్టని ప్రధాని మోదీ, పార్లమెంటులో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇంతటి పాలనా వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అమాయకుల ప్రాణాలు మరెన్ని కోల్పోతే కేంద్రం స్పందిస్తుందని నిలదీశారు. మణిపుర్‌కు న్యాయం, గౌరవం, రాజ్యాంగ హక్కులు, శాశ్వత శాంతి లభించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర భద్రత, స్థిరత్వాన్ని బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెట్టకూడదని హెచ్చరించారు. అలాగే మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రధాని మోదీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. డీలిమిటేషన్ గురించి వేచి చూడకుండా ప్రస్తుత సభలో ఉన్నవారితోనే 33శాతం రిజర్వేషన్లు అములు చేయొచ్చని ఆయన స్పష్టం చేశారు.

పీఎం-దక్ష్ పథకంపైనా కాంగ్రెస్ విమర్శలు

ఇదిలా ఉండగా, అర్హులైన వర్గాలకు నైపుణ్య శిక్షణ ఇచ్చే పీఎం-దక్ష్ పథకం అమలులో లోపాలున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ బుధవారం కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది.

ఎల్‌నినో ఎఫెక్ట్.. ఉపాధి హామీ పనులపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..!

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క తెలిపారు. తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా అధికారులకు సూచనలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాలకు నిల్వ చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రామప్ప చెరువులో 29 అడుగుల నీటి నిల్వ

ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని రామప్ప చెరువు, అక్కడి డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టును మంత్రి సీతక్క పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో ప్రస్తుతం 29 అడుగుల మేర నీరు అందుబాటులో ఉందని తెలిపారు. గోదావరి నుంచి నీటిని పంపింగ్ చేసి చెరువులు, పరిసర ప్రాంతాలకు సరఫరా చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నీటి నిల్వలు, సరఫరా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులను మంత్రి సూచించారు. రామప్ప చెరువులోని నీటిని డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసి ములుగు, వెంకటాపురం, గోవిందరావుపేట, మల్లంపల్లి పరిసర ప్రాంతాలతో పాటు భూపాలపల్లి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామాల్లో నీటి లభ్యత, చెరువుల పరిస్థితి, భూగర్భ జలమట్టాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

ఉపాధి హామీ పనులతో నీటి సంరక్షణ

వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం, భవిష్యత్తు అవసరాలకు నిల్వ చేసుకోవడం అత్యంత కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, బోర్ల రీచార్జ్ వంటి పనులను విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ పనుల ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలను కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. సర్పంచులు, గ్రామస్థులు ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు.

ప్రకృతి వైపరీత్యాలపై రాజకీయాలు వద్దు

అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి పరిణామాలను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాదని సీతక్క అన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఎదురయ్యే సవాళ్లను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ

సాగునీటి అవసరాలతో పాటు ప్రజలకు తాగునీరు అందించడమే ప్రథమ ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. రామప్ప-లక్నవరం కాలువ వంటి ప్రతిపాదిత ప్రాజెక్టులతో పాటు ప్రత్య

ఎంపీటీసీ అభ్యర్థిగా టీడీపీ నుంచి ఎం. శాంతి నామినేషన్

రిటర్నింగ్ అధికారి బాలాజీ నాయక్‌కు పత్రాలు అందజేత



తిరుపతి జిల్లా, అక్టోబర్ 22, ప్రజా న్యూస్ నెట్‌వర్క్:
సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు ఎస్.ఎస్.పురం గ్రామానికి చెందిన టీడీపీ అభ్యర్థి ఎం. శాంతి ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి బాలాజీ నాయక్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ప్రణీత్ రెడ్డి పాల్గొన్నారు.

గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదాయబద్ధంగా దసరా వేడుకలు

- ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు..

పోలీస్ సిబ్బందిలో పండుగ సందడి



సూర్యాపేట జిల్లా, అక్టోబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి
సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో విజయదశమి పండుగను పురస్కరించుకుని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా దసరా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉంటూ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించే పోలీస్ సిబ్బంది పండుగ సందర్భంగా కలిసి వేడుకలు జరుపుకోవడంతో పోలీస్ స్టేషన్‌లో పండుగ వాతావరణం నెలకొంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణతో పాటు సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ పోలీస్ సిబ్బంది ఐకమత్యం, పరస్పర సహకారం, స్నేహభావాన్ని చాటిచెప్పేలా వేడుకల్లో పాల్గొన్నారు. ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఉత్సాహంగా దసరా వేడుకలు నిర్వహించడంతో పోలీస్ స్టేషన్‌లో సందడి నెలకొంది.

ఇందిరమ్మ కాలనీ ఆరవ వార్డు లో ఘనంగా కనకదుర్గ అమ్మవారి శోభాయాత్ర



మిర్యాలగూడ అక్టోబర్ 21 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి. వెంకటయ్య):
మిర్యాలగూడ పట్టణ పరిధిలో ఆరో వార్డు ఇంద్రమ్మ కాలనీలో కనకదుర్గ అమ్మవారి శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ఆరో వార్డు కౌన్సిలర్ ఆడోత్ అశోక్ నాయక్ మరియు ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. మేళతాళాలు, భక్తుల కోలాట బృందాలచే జయజయధ్వానాలు, ఉత్సాహభరితమైన నృత్యాల నడుమ అమ్మవారి శోభాయాత్ర కొనసాగింది. కాలనీలోని ప్రధాన వీధుల గుండా సాగిన యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఆడోత్ అశోక్ దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, విద్యార్థులకు ఉన్నతమైన ఉద్యోగాలు,రైతులకు మేలు జరిగేలా సకాలంలో వర్షాలు కురవాలని, రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో సాగిన శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలతో ఇందిరమ్మ కాలనీలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన దాతలు, భక్తులు, భవాని స్వాములు, యువతి యువకులకు, వార్డు ప్రజలందరికీ, ఉత్సవ కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానం ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రాణదానం

: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ .

తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు...

కుత్బుల్లాపూర్. అక్టోబర్.21 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..
బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పుట్టినరోజును పురస్కరించుకొని పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో "తలసేమియా సికిల్ సెల్ సొసైటీ సౌజన్యంతో" సుభాష్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, గుబ్బల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సుమారు 100 మంది రక్తదాతలను అభినందించి వారికి సర్టిఫికెట్లను అందజేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నా పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసిన నిర్వాహకులకు, తలసేమియా సొసైటీ సభ్యులకు, రక్త దాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రతీ ఒక్కరికీ పేరుపేరున నా కృతజ్ఞతలు. ఆరోగ్యకరమైన వ్యక్తి ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల వారి ఆరోగ్యం మరింత మెరుగవడమే కాకుండా ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని అందించినట్లు అవుతుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీ, డాక్టర్ శ్రీనివాస్ & బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ 19వ వార్డులో బతుకమ్మ సంబరాలు..

- 62 మంది మహిళలకు బహుమతుల పంపిణీ!

- బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దిన మహిళలకు సత్కారం.. సంప్రదాయాల పరిరక్షణకు ప్రోత్సాహం





హుజూర్‌నగర్ పట్టణం, అక్టోబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:
తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని హుజూర్‌నగర్ పట్టణంలోని 19వ వార్డు గోదాం బజార్‌లో మహిళల కోసం ప్రత్యేక బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 19వ వార్డు ఇన్‌చార్జి ఎం.డి. అజీజ్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అందంగా బతుకమ్మలను తయారుచేసిన 62 మంది మహిళలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మహిళల్లో ఉత్సాహాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా నిలిచింది. కార్యక్రమానికి రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అట్లూరి హరిబాబు, మాజీ ఎంపీపీ నర్సింగ్ వెంకటేశ్వర్లు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు గల వెంకటేశ్వర్లు, పోతుల జ్ఞానయ్య ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, మహిళల ఐక్యతకు, ప్రకృతి పట్ల మనకున్న అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొనే మహిళల ఉత్సాహం అభినందనీయమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా మన ప్రాంత సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని సమాజానికి చాటిచెబుతాయని తెలిపారు. 19వ వార్డు ఇన్‌చార్జి ఎం.డి. అజీజ్ పాషా మహిళలను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చి 62 మంది మహిళలకు బహుమతులు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో వార్డు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అజీజ్ పాషా అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని, ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించాలని పిలుపునిచ్చారు. పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యతను పెంచే వేదికలుగా నిలవాలని, మహిళల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజంలో వారికి మరింత గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. బతుకమ్మలను తయారుచేసిన మహిళలకు బహుమతులు అందించడం వారి కృషికి గుర్తింపుగా నిలుస్తుందని, భవిష్యత్తులోనూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ బచ్చు రామారావు, అడ్వకేట్ చక్రాల వెంకటేశ్వర్లు, ముషం సత్యనారాయణ, అబ్దుల్ మజీద్ భాయ్, సమ్మేట సుబ్బరాజు, పి. రామ్మూర్తి, రజాక్ బాబా, మేళ్లచెరువు ముక్కంటి, బిక్కన్ సబ్, గొట్టేముక్కుల రాములు, ఎల్లావుల ఉమా, బి. ఈశ్వరి, గీత, లింగమ్మ, సైదమ్మ, జక్కుల లక్ష్మి, మౌనిక, వినీత, నాగమణి, పద్మ, చక్రాల ధనలక్ష్మి, స్వాతి, వసంత, శిరీష, లక్ష్మి, గంగమ్మ, అనసూయ, సునీత, అహల్య, శైలజ, నాగలక్ష్మి, భూలక్ష్మి, చక్రాల గీత, నేహా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యం

అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించాలి : మాజీ ట్రైకార్ చైర్మన్ రాంచందర్ నాయక్



త్రిపురారం మండలం, అక్టోబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, రిపోర్టర్ గాసిరాం:
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి, బాబుసాయిపేట గ్రామాల్లో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటు నమోదు చేయించాలని, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వైద్యులను నేరుగా కలిసి అవగాహన కల్పించాలని సూచించారు. దసరా సెలవులకు స్వగ్రామాలకు వచ్చే పట్టభద్రులను సంప్రదించి ఓటరు నమోదును వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కలకొండ వెంకటేశ్వర్లు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చందు నాయక్, బైరం కృష్ణ, అనుముల శ్యాంసుందర్ రెడ్డి, అనుముల సుధాకర్ రెడ్డి, సర్పంచ్ గుండెబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి పాలాభిషేకం పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు

- బసవయ్య గురుస్వామి ఆధ్వర్యంలో



చిలుకూరు అక్టోబర్ 21 (ప్రజా న్యూస్ నెట్ వర్క్ సూరిబాబు)
చిలుకూరు మండలం రామాపురం గ్రామంలో బుధవారం అయ్యప్ప స్వామి మందిరంలో బసవయ్య గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా స్వామివారి పాలాభిషేకం నిర్వహించారు అనంతరం పల్లవి సేవ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో దుర్గామాత భక్తులు అయ్యప్ప మాల ధారణ ధరించిన భక్తులు బసవయ్య గురుస్వామి, రాయబారపు వెంకటరమణ స్వామి, నాగరాజు స్వామి, మహేష్ స్వామి, వేమూరి లక్ష్మణ్ స్వామి, బసవయ్య స్వామి, వేమూరి జానకి స్వామి, అమరగాని నరసింహారావు స్వామి, నర్సింగ్ శ్రీను స్వామి, చారి, సోమయ్య స్వామి, జల్ల పెళ్లి నరేష్ స్వామి, పోలంపల్లి సైదులు స్వామి, సాయి స్వామి, శ్రీను స్వామి, వెంకటేశ్వర్ల స్వామి, కలకోవ కోటయ్య స్వామి, అమరగాని మనోజ్ చంద్ర స్వామి, భారీ రామారావు స్వామి, అమర గాని కృష్ణస్వామి, అయ్యప్ప మాలధారణ ధరించిన భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

హుజూర్‌నగర్‌లో దారుణం..

- ఇంట్లో నిద్రిస్తున్న 73 ఏళ్ల వృద్ధురాలి హత్య!

- వృద్ధురాలిని చంపి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు అపహరణ.. పట్టణంలో కలకలం

- కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు.. దర్యాప్తు చేపట్టిన సీఐ చరమంద రాజు





హుజూర్‌నగర్ పట్టణం, అక్టోబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:

హుజూర్‌నగర్ పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీలో వృద్ధురాలి హత్య కలకలం రేపింది. లక్ష్మయ్య రైస్ మిల్ సమీపంలోని తన ఇంట్లో నివసిస్తున్న మామిడి రాములమ్మ (73), భర్త బ్రహ్మం, రాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఆమెను హత్య చేసి, మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగించింది. వృద్ధురాలిపై దాడి చేసి బంగారు ఆభరణాన్ని దోచుకెళ్లిన ఘటనతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు.

సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి కుమారుడు మామిడి నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హుజూర్‌నగర్ ఎస్ఐ చలికంటి నరేష్ కేసు నమోదు చేయగా, హుజూర్‌నగర్ సీఐ జి. చరమంద రాజు దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధురాలి హత్యకు దారితీసిన పరిస్థితులు, బంగారు పుస్తెలతాడు అపహరణ వెనుక ఉన్నవారి వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు విచారణ చేపట్టారు. నిందితులను గుర్తించి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

వేపల సింగారం దాడి కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

- ఇద్దరిపై కత్తితో దాడి చేసిన ఘటన.. నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు

- ఎస్ఐ చలికంటి నరేష్ ఆధ్వర్యంలో చర్యలు.. కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

హుజూర్‌నగర్ మండలం, అక్టోబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:

హుజూర్‌నగర్ మండలం వేపల సింగారం గ్రామంలో జరిగిన హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. ఈ నెల 19న జరిగిన ఘటనలో సూరోజు మధుసూదనాచారి, సూరోజు భార్గవచారిపై కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు పోలీసుల సమాచారం. ఈ కేసులో ఎస్ఐ చలికంటి నరేష్ చర్యలు చేపట్టి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల వివరాలు: ఏ-1 ధరావత్ మహేష్ (22), తండ్రి రామ, డ్రైవర్; ఏ-2 తేజావత్ వంశీ (26), తండ్రి వెంకటేశ్వర్లు, హార్వెస్టర్ డ్రైవర్; ఏ-3 ధరావత్ కృష్ణ నాయక్ (42), తండ్రి లక్ష్మానాయక్, కిరాణా వ్యాపారి; ఏ-4 ధరావత్ శ్రీను నాయక్ (46), తండ్రి లక్ష్మానాయక్, వ్యవసాయం. వీరంతా మిట్టగూడెం గ్రామానికి చెందినవారిగా పోలీసులు పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

దసరా సందర్భంగా వేపలమాధవరంలో హోరాహోరీ కబడ్డీ పోటీలు

- యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో క్రీడా సంబరాలు

- విజేతలకు రూ.6,016, రూ.4,016, రూ.2,016 నగదు బహుమతులు

- గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి: వార్డు సభ్యుడు బోగాల శివారెడ్డి

మేళ్లచెరువు మండలం, అక్టోబర్ 20, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, మండల రిపోర్టర్ రాజేష్ గుండెపంగు:





దసరా పండుగను పురస్కరించుకుని మేళ్లచెరువు మండలం వేపలమాధవరం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కర్నె గురువారెడ్డి ఆధ్వర్యంలో ఒకరోజు కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్థుల ఆదరణ మధ్య జరిగిన ఈ పోటీలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యువ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా మొదటి వార్డు సభ్యుడు బోగాల శివారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. క్రీడల్లో పట్టుదలతో ముందుకు సాగుతూ కన్నతల్లిని, పుట్టిన ఊరిని ఎప్పటికీ మరిచిపోకూడదని, తమ విజయాలతో తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.6,016ను అంబేద్కర్ యూత్ జట్టు గెలుచుకుంది. ఈ జట్టులో సురేష్, కొండ, ఏసోబు, కరుణాకర్, సాయి, సింహాద్రి, గౌతమ్ పాల్గొన్నారు. రెండో బహుమతి రూ.4,016ను గణేష్ యూత్ జట్టు, మూడో బహుమతి రూ.2,016ను పబ్జీ యూత్ జట్టు సాధించాయి. కార్యక్రమంలో మొదటి వార్డు సభ్యుడు బోగాల శివారెడ్డి, తొమ్మిదో వార్డు సభ్యుడు షేక్ బేగం వహీద్, పదో వార్డు సభ్యురాలు కడియం నాగలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నందికొండమునిసిపాలిటీలో ప్రమాదకరంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ .

నాగార్జునసాగర్ (నందికొండ),అక్టోబర్ 20, ప్రజా న్యూస్ నెటవర్క్,రిపోర్టర్ కిరణ్ కుమార్



నాగార్జునసాగర్ ప్రాజెక్టు నందికొండ మున్సిపాలిటీ పరిధిలో హిల్ కాలనీలో గల బాలభవన్ కూడలి దలికి ఎదురుగా ఉన్నరోడ్డుపై తెరిచి ఉన్న లేదా విరిగిపోయిన మ్యాన్‌హోల్ , కరెంట్ ఆఫీస్ ముందు ఉన్న మ్యాన్ హోల్ లో రాళ్లు వేసి పూడ్చినారు కానీ బాల భవన్ స్కూలు ముందు ఉన్న మ్యాన్ హోల్ పై మూత విరిగిపోయి ఈ రోడ్డు మార్గంద్వారాప్రయాణించే పాదచారులకు, ప్రయాణికులకు, ముఖ్యంగా స్కూల్ కి వెళ్లే చిన్నపిల్లలకుప్రమాదకరంగా తయారయింది .

కాలనీలోఅండర్‌గ్రౌండ్‌డ్రైనేజీ కింద ఏర్పాటు చేసి ఎళ్లగడుస్తున్న నిర్వహణ సైతం సక్ర మంగా లేక మ్యాన్ హోల్స్ పైకప్పులు ధ్వంసమయ్యాయి. దీంతో అక్కడ మ్యాన్ హోల్స్‌నోళ్లుతెరుచుకున్నాయి. ప్రధానంగా పట్టణంలోని ఈ రోడ్లలో నిత్యం జనసంచారం ఉంటుంది.వాహనదారులు, పాదచారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు.మ్యాన్‌హోల్స్‌పైకప్పులులేకపోవడంతో ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉన్నది.

ప్రధానంగా మెయిన్ మార్కెట్ కు వెళ్లాలంటే ఈ మార్గం గుండానే వెళ్లాల్సి వస్తుంది. రాత్రివేళలో వచ్చి పోయేవారికి మ్యాన్‌హోల్స్ పైకప్పులుకనిపించకపోవడంతో వాటిలో పడి కాళ్లు చేతులు విరిగి ప్రమాదం ఉన్నాయి.పైగా వర్షాలు పడేటప్పుడు వర్షపు నీరు నిల్వ ఉండడం వలన మ్యాన్ హోల్స్ పైకప్పులు లేనివాటిని గుర్తించడం కష్టం. ఇలాంటి సమయాల్లో ప్రమాదాలు మరింత ఎక్కువగా జరిగే అవకాశం లేకపోలేదు. మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంపై పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎక్కడైతే మ్యాన్‌హోల్స్ పైకప్పు లేని వాటికి తక్షణమే తక్షణమే పై కప్పులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎవరైనా ప్రమాదానికి గురైతే తప్ప అధికారులు పట్టించుకోరా అని కాలనీ ప్రజలుఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దసరా పండుగ వేళ బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి: సీపీ సజ్జనార్



దసరా పండుగ సందర్భంగా కొందరు స్వార్థపరులు బోనుల్లో బంధించిన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'లకు హైదరాబాద్ నగర పోలీసులు విముక్తి కల్పించారు. పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, మొత్తం నాలుగు పాలపిట్టలను కాపాడినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు.దసరా పండుగ నాడు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయాన్ని కొందరు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించినా, కొందరు వాటిని పెడచెవిన పెట్టారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద ఓ ఆలయం దగ్గర రెండు పాలపిట్టలను, ఛత్రినాక శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద ఒకటి, మంగళ్‌హాట్ బాలాజీనగర్ ఆలయం సమీపంలో మరో పాలపిట్టను బోనుల్లో బంధించి ఉంచారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తీవ్ర యాతనకు గురవుతున్న నాలుగు పాలపిట్టలను స్వాధీనం చేసుకుని, వాటిని కేబీఆర్ పార్క్ అటవీ శాఖ అధికారులకు సురక్షితంగా అప్పగించారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితులపై అటవీ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సజ్జనార్ తెలిపారు."స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షిని పండుగ పేరుతో బంధించి, తిండి, నీరు లేకుండా హింసించడం ఎవరికీ మంచిది కాదు. బోనులోని పక్షి ఆర్తనాదాలతో శుభం ఎలా కనిపిస్తుంది? జీవుల పట్ల కరుణ చూపడమే నిజమైన భక్తి కానీ, ప్రకృతిని బంధించడం కాదు" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి అమానవీయ చర్యలను ఎవరూ ప్రోత్సహించవద్దని, వన్యప్రాణులకు హాని తలపెట్టే ఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే 18004255364, 9803338666 లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇండియా కూటమి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం

: బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్




కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి కలిసి దేశవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తూ, నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. న్యాయస్థానాలు, రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా వారి చర్యలు ఉన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ ప్రయోజనాల కంటే అధికారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు.నిరసనల ముసుగులో చట్టాలను ఉల్లంఘించడం, నిరాధార ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, అశాంతి సృష్టించేందుకు విదేశీ నిధులు కూడా వస్తున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టత ఇచ్చిందని, ఎలాంటి ఆధారాలు లేకుండా లక్షలాది మంది ఓటర్లను జాబితాలో చేర్చాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చేలా యాత్రలు నిర్వహించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు.ఇండియా కూటమి అసత్య కథనాలను తిప్పికొట్టేందుకు బీజేపీ దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు లక్ష్మణ్ ప్రకటించారు. అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన నగరాల్లో బహిరంగ సభలు, మేధావులు–విద్యావంతులతో చర్చాగోష్ఠులు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 మందితో సమావేశాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. దేశ భద్రత, అర్హులైన ఓటర్ల హక్కుల విషయంలో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోదని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణతో పాటు జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియ, ప్రతిపక్షాల నిరసనలపై రాజకీయ వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో లక్ష్మణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు ప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణ, ఎన్నికల సమగ్రత గురించిన ఆందోళనలను తెలియజేయడానికే తమ చర్యలని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

మీ కుటుంబ సభ్యులకు బీపీ, షుగర్ ఉంటే.. రోజూ వాళ్లకు గోలీలు వేసి కాపాడుకోండి

- దేవుడిని మొక్కడానికి ముందే.. తప్పకుండా గోలీలు వేయాలని సూచించిన జగ్గారెడ్డి - బీపీ, షుగర్ వున్న వాళ్ళ ఆరోగ్యం మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారిని కాపాడుకోవాలని సూచన

- దసరా వేడుకల సందర్భంగా ప్రజలను కోరిన జగ్గారెడ్డి





(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 21 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

"ప్రతి రోజూ దేవుడిని మొక్కే ముందే బీపీ, షుగర్ ఉన్నవారు వైద్యులు సూచించిన విధంగా మందులు వేసుకోవాలి. ఇంట్లో బీపీ, షుగర్‌తో బాధపడుతున్న తల్లిదండ్రులు ఉంటే వారు క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా కుటుంబ సభ్యులు శ్రద్ధ పెట్టాలి" అని జగ్గారెడ్డి ప్రజలకు సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కొడుకులు, కుమార్తెలు, కోడళ్లపై ఉందన్నారు. సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ కుటుంబ బంధాలు, పెద్దల ఆరోగ్యం, సంగారెడ్డి ప్రజలతో తనకున్న అనుబంధం గురించి భావోద్వేగంగా మాట్లాడారు.

అంబరాన్నంటిన దసరా సంబురాలు

సంగారెడ్డిలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఏటా అంబేద్కర్ స్టేడియం వేదికగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా వేడుకలు ఈసారి కూడా అత్యంత వైభవంగా సాగాయి. పట్టణంలోని రామమందిరంలో ప్రత్యేక భజన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రామమందిరం భజన మండలి సభ్యులు, భక్తులతో కలిసి జగ్గారెడ్డి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శావను తీసుకుని రామమందిరం నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు.

అంబేద్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. వేదికపై మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా జమ్మిపూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రావణ దహన కార్యక్రమం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీగా తరలివచ్చిన ప్రజలు రావణ దహనాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆకాశంలో వెలుగులు విరజిమ్మిన బాణసంచా మెరుపులు, ఆకట్టుకునే డ్రోన్ల ప్రదర్శన ప్రేక్షకులను కనువిందు చేశాయి.ప్రముఖ సినీ నేపథ్య గాయకులచే ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహూతులను మంత్ర ముగ్ధులను చేసింది.

సంగారెడ్డి ప్రజలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారు

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానాన్ని, సంగారెడ్డి ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "నా దగ్గర చాలా డబ్బులు ఉన్నాయని అందరూ అనుకుంటారు. కానీ నాకు వచ్చిన డబ్బును ప్రతి ఏటా సంగారెడ్డి ప్రజల కోసం పండుగలు నిర్వహించడానికి ఖర్చు చేస్తున్నాను. నలభై ఏళ్ల క్రితం చిన్న వయసులో ఉన్నప్పుడు ఇదే మైదానంలో నా స్నేహితులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నాను. ఆనాటి నుంచి ఈనాటి వరకు సంగారెడ్డితో నా అనుబంధం కొనసాగుతోంది. నన్ను కౌన్సిలర్ స్థాయి నుంచి ఈ స్థాయికి తీసుకొచ్చింది సంగారెడ్డి ప్రజలే" అని పేర్కొన్నారు.

దసరా వేదికను తాను ఎన్నడూ రాజకీయాల కోసం ఉపయోగించుకోలేదన్నారు. "ఈ వేదికపై నుంచి నేను ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడలేదు. ఓట్లు అడగలేదు. కానీ నా మనసులో ఉన్న మాటలను మాత్రం ప్రజలతో పంచుకుంటాను" అని చెప్పారు.

సంగారెడ్డి ప్రజలంతా నా కుటుంబమే

"కుటుంబం అంటే కేవలం నా భార్య, పిల్లలు మాత్రమే కాదు. సంగారెడ్డి ప్రజలందరినీ నా కుటుంబ సభ్యులుగానే భావిస్తాను. అందుకే ప్రతి ఏటా అందరితో కలిసి పండుగలు జరుపుకుంటాను" అని జగ్గారెడ్డి అన్నారు.

వయసు పెరిగేకొద్దీ తల్లిదండ్రుల ఆరోగ్యంపై పిల్లలు మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పెద్దలు వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా చూడాలన్నారు. ఇంట్లో పెద్దల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, వారికి అవసరమైన సంరక్షణ అందించాలని కోరారు. కొడుకులు, కుమార్తెలతో పాటు కోడళ్లు కూడా కుటుంబంలోని పెద్దల ఆరోగ్యంపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కాళ్లు, చేతులు పడిపోయిన తర్వాత ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా ప్రయోజనం లేదన్నారు.

పండుగలంటే కేవలం ఆటపాటలు, వినోదం మాత్రమే కాదని, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పెంపొందించుకునే సందర్భాలని ఆయన వ్యాఖ్యల ద్వారా సందేశమిచ్చారు. ప్రజల ఆరోగ్యం, కుటుంబ బంధాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ జగ్గారెడ్డి చేసిన ప్రసంగం దసరా వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచింది.

నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి

: అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం



రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలపై భారం పడకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ధరలు పెరుగుతున్నాయని, దాని ప్రభావం రాష్ట్రంపై పడకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బియ్యం, కందిపప్పు, ఉల్లి, వంటనూనె, పంచదార వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అమ్మకాలపై ఆయన ఆరా తీశారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అధికారులు వివరించగా.. దీపావళి, సంక్రాంతి పండుగల సమయంలో కూడా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. మార్కెట్‌లో ఉల్లిపాయల సరఫరాను మరింత పెంచి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ పథకం అమలులో జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నామని, దీన్ని మరింత మెరుగుపరచాలన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరో తొమ్మిది లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, దీని కోసం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.ఇసుక సరఫరాలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం సూచించారు. పాలనలో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మంగళగిరిలో వైసీపీకి షాక్..

లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన కీలక నేత



మంగళగిరి నియోజకవర్గంలో అధికార తెలుగుదేశం పార్టీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, గుంటూరు పార్లమెంట్ వైసీపీ ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్ తన మద్దతుదారులతో కలిసి టీడీపీలో చేరారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు, మరో 25 కుటుంబాలకు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. “2024 సార్వత్రిక ఎన్నికల కంటే స్థానిక ఎన్నికల్లోనే ఎక్కువ మెజార్టీ సాధించాలి. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి. ఎన్డీయే పక్షాన నిలబడటమే మనకు శ్రీరామరక్ష. అప్పుడే మనం అనుకున్న అభివృద్ధి సాధ్యమవుతుంది“ అని ఆయన స్పష్టం చేశారు.గత పదేళ్ల పాలనను, తన రెండున్నరేళ్ల పనితీరును బేరీజు వేసుకుని ప్రజలు ఓటు వేయాలని లోకేశ్ కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ, ఆసుపత్రి, కమ్యూనిటీ భవనాలు, పార్కులు వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అహర్నిశలు పనిచేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎంపీపీ అయిన రజనీకాంత్‌తో పాటు, చిలువూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ యాళ్ల జయలక్ష్మీ, ఇతర టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టిసీమ పంపులు పీకేస్తానన్న జగన్..

ఇప్పుడు అవే నీళ్లు తాగుతున్నారు : దేవినేని ఉమా

- స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే జగన్ డ్రామాలు ఆడుతున్నారన్న దేవినేని ఉమా

- కూటమి అభ్యర్థులు 90 శాతం స్థానాలు గెలవడం ఖాయమని జోస్యం

- వైసీపీ నేతలే నామినేషన్ పత్రాలు చింపుకుని బురదజల్లుతున్నారని ఆరోపణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమనే భయంతోనే వైసీపీ అధినేత జగన్ సరికొత్త డ్రామాలకు తెరలేపారని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా విమర్శించారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 90 శాతానికి పైగా స్థానాలు గెలుచుకోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
వైసీపీ నేతలే తమ నామినేషన్ పత్రాలను స్వయంగా చించుకుని, ఆ నెపాన్ని పోలీసులు, ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేవినేని ఉమా మండిపడ్డారు. “నామినేషన్లకు వెళ్తున్నారా? యుద్ధానికి వెళ్తున్నారా? పోలీసులపై దాడులు చేయడం ఏ సంస్కృతి?“ అని ఆయన ప్రశ్నించారు. దర్శిలో మహిళా కానిస్టేబుల్, ఎస్సైల తలలు పగలగొట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో వైసీపీనే విధ్వంసం సృష్టించి, ఆ నెపాన్ని ప్రభుత్వంపై వేస్తోందని ఆరోపించారు. పులివెందులలో కిందిస్థాయి నేతలను నామినేషన్లు వేయమని జగన్ బతిమాలుకునే దుస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. గతంలో పట్టిసీమ పంపులు పీకేస్తానని అన్న జగన్, ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో అవే నీళ్లు తాగుతున్నారని విమర్శించారు. చంద్రబాబు దూరదృష్టితో తెచ్చిన పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులే రాయలసీమ, విశాఖ, కృష్ణా డెల్టాలను కాపాడుతున్నాయని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై కూడా వైసీపీ మీడియా వక్రభాష్యాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం..

భావితరాలకు స్ఫూర్తిదాయకం

- ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరుల సేవలు మరువలేనివి: ఎస్పీ కె. నరసింహ

- అమరవీరుల ఆశయాలే మా బాట.. ప్రజలకు నిబద్ధతతో సేవ చేయడమే నిజమైన నివాళి

- సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు ఫ్లాగ్ డే.. 154 మంది అమరవీరులకు స్మరణాంజలి





సూర్యాపేట జిల్లా, అక్టోబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:

ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం, పోలీసు ఫ్లాగ్ డే సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా ప్రాణాలు అర్పించిన 154 మంది పోలీసు అమరవీరుల పేర్లను అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి స్మరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని, ప్రజలకు నిబద్ధతతో సేవలందించడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగం కేవలం వృత్తి మాత్రమే కాదని, ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేయాల్సిన పవిత్రమైన బాధ్యత అని అన్నారు. సూర్యాపేట జిల్లాలోనూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు వీరుల త్యాగాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌పై నక్సల్స్ దాడిలో హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ అమరులయ్యారని, 2015 ఏప్రిల్ 2న సూర్యాపేట హైటెక్ బస్టాండ్ వద్ద జరిగిన కాల్పుల ఘటనలో కానిస్టేబుల్ ఎం. లింగయ్య, హోంగార్డు కె. మహేష్ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. నాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీల సమయంలో కారు ఢీకొనడంతో కానిస్టేబుల్ శీలం కమలాకర్ అమరులయ్యారని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కుటుంబ సభ్యుల గౌరవప్రదమైన జీవనానికి సహకరిస్తామని తెలిపారు. బాధితులకు న్యాయం చేయడం, మహిళలు, పిల్లలు, వృద్ధులకు భరోసా కల్పించడం, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడం ప్రతి పోలీసు అధికారి బాధ్యతని స్పష్టం చేశారు. సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలనతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ చట్టాన్ని గౌరవించి, న్యాయాన్ని పరిరక్షిస్తూ ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ జానయ్య స్మృతి పరేడ్ కమాండర్‌గా వ్యవహరించగా, ఆర్మ్డ్ డీఎస్పీ నరసింహాచారి కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, నరసింహాచారి, పలువురు పోలీసు ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సంఘం ప్రతినిధులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు దసరా శుభాకాంక్షలు

తెలిపిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

జమ్మి ఆకులు అందజేస్తూ.. ఆత్మీయ ఆలింగనాలతో విజయదశమి శుభాకాంక్షలు

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 21: ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..





విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారుఎమ్మెల్యేను కలిసిన నాయకులు, కార్యకర్తలు జమ్మి ఆకులు అందజేసి, ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆత్మీయంగా మమేకమయ్యారు. జమ్మి ఆకులను పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటూ, పెద్దల ఆశీస్సులు తీసుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేకమైన భాగండచెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని, ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని ఆకాంక్షించారుడప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించడమే కాకుండా ప్రజల మధ్య ప్రేమాభిమానాలను, ఆత్మీయతను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారుడకార్యక్రమంలో పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ పట్టణ వ్యాప్తంగా ఆనందోత్సవాలతో దసరా ఉత్సవాలు

దసరా ఉత్సవాలు, దుర్గామాతల విగ్రహాలతో కొలువైన కాలనీలు.





మిర్యాలగూడ, అక్టోబర్ 21, (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య) :

మిర్యాలగూడ పట్టణవ్యాప్తంగా మంగళవారం దసరా ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సవాల మధ్య మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి పాల్గొని ఘనంగా జరుపుకున్నారు. మిర్యాలగూడ పట్టణ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ దసరా పండగ వేడుకల కోసం సుదూర ప్రాంతాల నుంచి మిర్యాలగూడ చేరుకొని సందడి చేశారని. ప్రజలంతా నూతన వస్త్రాలను ధరించి దేవాలయాలలో దుర్గామాత లకు దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు కాలనీలో యువజన సంఘాలు ,నవరాత్రుల ఉత్సవ కమిటీలు ,దుర్గామాత విగ్రహాలను నెలకొల్పి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు దసరా ఉత్సవాల కోసం పిండి వంటలను తయారు చేయడంతో కాలనీలు గుమగుమలాడాయి. బంధుమిత్రులతో పిల్లాపాపలతో నూతన వస్త్రాలు ధరించిన ప్రజలు సాయంత్రం దేవాలయాల వద్దకు చేరుకున్నారని. కాలనీ ప్రజలుతమ ఇండ్ల వద్ద నుంచి పూజా సామాగ్రిని తీసుకొని డప్పు వాయిద్యాల మధ్య దేవాలయ వద్దకు చేరుకున్నారు.
అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించినఅనంతరం ర్యాలీగా వెళ్లి దేవాలయ వద్దకు చేరుకొని జమ్మి చెట్టు వద్ద శమీ పూజలు నిర్వహించి జమ్మి ఆకును తీసుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలోరావణుని బొమ్మలను దహనం చేసి దసరా పండుగ ఉత్సవాలకు కొత్త రూపును తీసుకువచ్చారు. అనంతరం పాలపిట్టలను దర్శనం చేసుకున్నారు. జమ్మి చెట్టు ఆకులను పంచుకుంటూ కుటుంబ సభ్యులు స్నేహితులు బంధుమిత్రులతో ఒకరికొకరు ఆలింగనము చేసుకుంటూ ఒకరికొకరు దసరా పండగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. రాత్రి ఇంటికి చేరుకొని పటాకులు కాల్చి వెలుగులు నింపుతూ కాలనీలోఆనందంగా పండగలు జరుపుకున్నారు. మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి తమ నాయకులు ఉత్సవాలలో పాల్గొని ప్రజలతో కలిసి మెలిసి కష్టసుఖాలను మాట్లాడుకున్నారు. దేవాలయాలను మరియు జమ్మి చెట్టును ప్రత్యేక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.